సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ

మేడ్చల్, జూన్ 23: సివిల్ సర్వీస్ పరీక్షకు (ప్రిలిమ్స్, మెయిన్స్)కు సిద్ధం అవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్లో ఉచితంగా శిక్షణనివ్వనున్నట్టు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి వచ్చే ఏడాది మే వరకు 10 నెలల శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణతో పాటు వసతి సౌకర్యం కూడా పొందే అవకాశం ఉందన్నారు. 100 మంది అభ్యర్థుల శిక్షణకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులకు వచ్చే నెల 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో http://tsstudycircle.co.in దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మెట్రో ప్రమాదాలకు పరిహారం పెంపు

సిటీబ్యూరో, జూన్ 23(నమస్తే తెలంగాణ) : మెట్రో నిర్మాణం జరుగుతున్న, మెట్రో ప్రయాణంలో జరిగే ప్రమాదాలకు నష్టపరిహారాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించింది. మెట్రో రైలు ద్వారా జరిగే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే లేదా తీవ్ర గాయాలతో, రెండు చేతులకు నష్టం జరిగినా లేదా కాలు, చేతులకు అయ్యే గాయాలకు, తొడ భాగం, కళ్లు, చెవుడు, ముఖంపై కలిగిన గాయాలకు రూ. 8లక్షలను పరిహారంగా ఇవ్వనున్నారు. అదేవిధంగా ఇతర గాయాలకు కూడా రూ. 65వేల నుంచి రూ. 7.2లక్షల వరకు ప్రమాద తీవ్రతను బట్టి ఈ పరిహారాన్ని బాధితులకు ఇవ్వనున్నట్లుగా కేంద్ర గృహ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ మేరకు జీఎస్ఆర్ 402(ఈ) పేరిట నోటిఫికేషన్ జారీ చేసింది.

దరఖాస్తుల ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ, జూన్ 23: అబిడ్స్ బొగ్గులకుంటలో గల తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల(సాయంత్రం)లో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జే చెన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషా సాహిత్యాల్లో 1965 నుంచి విశేష కృషి చేస్తున్న పరిషత్ పీడీసీ(ప్రీ డిగ్రీ కోర్సు), బీఏ (లాంగ్వేజెస్) కోర్సులు కొనసాగుతున్నాయన్నా రు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు రెండేళ్ల పీడీసీ కోర్సుకు అర్హులని వెల్లడించారు. ఇంటర్ పూర్తి చేసిన వారు బీఏ లో డిగ్రీ ఆన్‌లైన్ పద్ధతి(దోస్త్) ద్వారా ప్రవేశం పొందాలన్నారు. తెలుగు ద్వితీయ భాషగా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఎంఏ కోర్సుకు అర్హులని తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి 9వ రకు తరగతులు జరుగుతాయన్నా రు. వివరాలకు 94410 851 14, 9032812971 నంబర్ లో సంప్రదించాలని చెన్నయ్య కోరా రు.

ఎన్నికల ఫీల్డ్ ఆఫీసర్లకు శిక్షణ

సిటీ బ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ఫీల్డ్ అధికారుల శిక్షణ తరగతులను భారత ఎన్నికల సంఘం ప్రారంభించింది. బీఎల్‌వోల పర్యవేక్షకుల 13వ బ్యాచ్ శిక్షణను సోమవారం న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ లో 379 మందికి శిక్షణ మొదలు పెట్టారు. ఈ సందర్భంగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ మాట్లాడుతూ.. యూపీ నుంచి 111 మంది, మధ్యప్రదేశ్ 128 మంది, నాగాలాండ్ 67, మేఘాలయ 66, చండీగఢ్ నుంచి ఏడుగురు శిక్షణకు హాజరైనట్లు వెల్లడించారు. మూడు నెలల్లో 5 వేల మందికి పైగా బీఎల్‌వోలు, బీఎల్‌వో పర్యవేక్షకులు శిక్షణ పొందినట్లు చెప్పారు. వారందరికీ ఎన్నికల నిర్వహణ, పాటించవలసిన నిబంధనల గురించి వివరించారు.

అవుట్ డోర్ మీడియాకు అన్యాయం

సిటీబ్యూరో, జూన్ 23(నమస్తే తెలంగాణ) : వేలాది మంది ఉపాధి పొందుతున్న అవుట్ డోర్ మీడియాకు స్వరాష్ట్రంలో తీరని అన్యాయం జరుగుతుందని తెలంగాణ అవుట్ డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్(టోమో) సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. అన్ని విభాగాల ప్రకటనలకు రుసుం వసూలు చేయాలని, కొత్త అనుమతులు జారీ చేయాలని, పెరిగిన హైదరాబాద్ పరిధికి అనుగుణంగా ఇతర మున్సిపాలటీల్లోనూ బహిరంగా హోర్డింగ్ నిర్వహణ సమస్యలపై ఎమ్మెల్సీతో చర్చించారు.

విదేశీ విద్యకు మొండిచేయి..!

- అంబేద్కర్ విదేశీ విద్యా పథకానికి మంజూరు కాని నిధులు
- 2వ సెమిస్టర్ ఫీజులను విద్యార్థుల ఖాతాల్లో జమచేయని సర్కార్

మేడ్చల్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): అంబేద్కర్ విదేశీ విద్యా పథకానికి నిధులు మంజూరు కాకపోవడంతో విదేశాలలో చదువుకుంటున్న ఎస్సీ విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. 2వ సెమిస్టర్ ఫీజుల చెల్లింపులకు సంబంధించి విద్యార్థుల ఖాతాల్లో నగదు ఇప్పటికీ జమ కాలేదు. 2వ సెమిస్టర్ ఫీజులకు సంబంధించి సంబంధిత షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ నుంచి వివరాలను పంపించినప్పటికీ ఆర్థికశాఖ నుంచి క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో ఫీజుల చెల్లింపు జరగలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అంబేద్కర్ విదేశీ విద్యా పథకానికి ఎంపికైన విద్యార్థులు.. విద్యను అభ్యసించేందుకు విదేశాలకు వెళ్తారు. వారి చదువుకు అవసరమయ్యే రూ.20 లక్షలను ప్రభుత్వం అందిస్తుంది. సెమిస్టర్ల వారీగా నిధులను అందించాల్సి ఉండగా గత సంవత్సరం మార్చి నెలలో నిధులు రాగా మొదటి సెమిస్టర్‌కు ఫీజులు చెల్లించారు. రెండవ సెమిస్టర్‌కు ఇప్పటివరకు ఫీజులకు సంబంధించిన నిధులు మంజూరు కాలేదు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి 2024-25 విద్యా సంవత్సరానికి గాను 72 మంది ఎస్సీ విద్యార్థులు ఈ పథకం ద్వారా విదేశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందలాది సంఖ్యలో ఎస్సీ విద్యార్థులు వెళ్లిన ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విదేశీ విద్యార్థులను పట్టించుకోవడం లేదని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

నిద్రావస్థలో సెలక్షన్ కమిటీ..!

అంబేద్కర్ విదేశీ విద్యా పథకానికి ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు విదేశీ విద్యకు విద్యార్థులను సెలక్ట్ చేయలేదు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి అంబేద్కర్ విద్యా విదేశీ పథకానికి అర్హత ఉన్న 32 మంది విద్యార్థులు జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారుల వివరాలను జిల్లా నుంచి ఎస్సీ కమిషనరేట్ కార్యాలయానికి సమర్పించినా ఇప్పటివరకు సెలక్షన్ చేయకపోవడంతో వివిధ దేశాలలో విద్యా సంవత్సరం ఆగస్టు నెలలో ప్రారంభం కానున్న నేపథ్యంలో సమయం తక్కువగా ఉండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో అంబేద్కర్ విదేశీ విద్య అమలవుతుందా లేదా అన్న సందేహాలను ఎస్సీ విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

అధికారులను ఆదేశించిన కమిషనర్ ఆర్వీ కర్ణన్

ప్రజావాణిలో 224 అర్జీలు స్వీకరణ

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగరం నలుమూలల నుంచి ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను కమిషనర్ స్వీకరించారు. ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపి తక్షణ చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 78 విన్నపాలు రాగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి 45, ట్యాక్స్ సెక్షన్ 13, శానిటేషన్ నాలుగు, ఇంజినీరింగ్ విభాగం మూడు, జలమండలి రెండు, భూసేకరణ, ఫైనాన్స్, ఏసీ లీగల్, విజిలెన్స్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా ఫోన్ ఇన్ ద్వారా ఏడు ఫిర్యాదులను స్వీకరించినట్లు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 146 అర్జీలు స్వీకరించగా, కూకట్‌పల్లిలో 57, సికింద్రాబాద్‌లో 53, శేరిలింగంపల్లిలో 17, చార్మినార్‌లో 8, ఎల్బీనగర్ జోన్‌లో ఆరు, ఖైరతాబాద్‌లో ఐదు అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్‌లు వేణుగోపాల్, సత్యనారాయణ, యాదగిరి రావు, వేణు గోపాల్ రెడ్డి, పంకజ, నళిని పద్మావతి, సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీలు వెంకన్న, గంగాధర్, ప్రదీప్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టండి

దోమల నివారణకు ఏఎల్ఓ కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. అడిషనల్ జోనల్ కమిషనర్‌లు, ఆయా విభాగాల హెచ్ఓడీలతో సోమవారం ఉదయం దోమల నివారణ, శానిటేషన్, కోర్టు కేసులపై కమిషనర్ సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జోన్‌లలో ఎంటమాలజీలో పనిచేస్తున్న సిబ్బంది ఏఎల్ఓ కార్యక్రమాలు చేయకుండా ఇతర విధులు కేటాయించినట్లు తెలిసినందున వారిని ఏఎల్ఓ కార్యక్రమాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్, డిప్యూటీ కమిషనర్‌లను ఆదేశించారు. శుభ్రతపై చేపడుతున్న ముందస్తు వర్షాకాల శానిటేషన్ డ్రైవ్‌ను మరిన్ని రోజులు కొనసాగించాలన్నారు.

డబ్బులు కొట్టు.. రేషన్ కార్డు పట్టు

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తామంటూ ఎర వేస్తున్నట్లు ఆరోపణలు గట్టిగానే వస్తున్నాయి. అధికారంలో ఉండటం వల్ల కాంగ్రెస్ నాయకులు చెబితే అధికారులు సైతం ఏం చేయలేనిస్థితి ఏర్పడుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. ఇలా పేద ప్రజల నుంచి వేలాది రూపాయలు దండుకొంటున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కార్డు రాదేమోనని ..

దళారులు తమ వద్ద డబ్బులు తీసుకుంటున్నారని బయటకు చెబితే రేషన్ కార్డు రానీయకుండా చేస్తారేమోనని దరఖాస్తుదారులు భయపడుతున్నారు. రూ.వెయ్యి, రెండు వేలకు అధికారులకు ఫిర్యాదు చేస్తే అధికారం అడ్డుపెట్టుకుని నాయకులు ఇబ్బందులు పెడతారని మిన్నకుంటున్నారు. డబ్బులు పోయినా రేషన్ కార్డు వస్తే కుటుంబానికి ఆసరా అవుతుందని భావిస్తున్నారు. నగరంలోని అంబర్‌పేట డివిజన్‌లో పలు కాలనీల్లో ఈ దందా జోరుగానే సాగుతుందని బాధితులు చెబుతున్నారు. కాంగ్రెస్ సహా పలు పార్టీల నేతలు కూడా దళారుల అవతారం ఎత్తుతున్నట్లు తెలుస్తున్నది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ బస్తీల్లోనూ ఇదే తరహా దందా కొనసాగుతున్నట్లు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డు కోసం ఏకంగా రూ.5 వేలు తీసుకున్నారని ఓ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.నగరమంతా ఇదే పరిస్థితి కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. అధికారులు దళారులకు డబ్బులు ఇవ్వొద్దని అర్హులందరికీ కాస్త ఆలస్యమైనా రేషన్ కార్డులు ఇస్తామని చెబుతున్నారు.

జీహెచ్ఎంసీలో పలువురికి పోస్టింగ్‌లు

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలోని 11 మంది స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లకు సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లుగా పదోన్నతి కల్పించగా..వారికి పోస్టింగ్‌లు ఇస్తూ సోమవారం పురపాలక శాఖ సెక్రటరీ టీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న అరుణ కుమారి, యాదయ్య, మధు కిరణ్, మోహన్ రెడ్డి, ఎంకేవ అలీ, మల్లికార్జున్ రావు, ఉమా ప్రకాశ్, నారాయణ రావు, యాదయ్య, రవి కుమార్‌లకు ఇటీవల పదోన్నతి దక్కింది. తిరిగి వీరికి జీహెచ్ఎంసీలోనే పోస్టింగ్ దక్కడం గమనార్హం.

చందానగర్‌లో ఆకాష్ సెంటర్ ప్రారంభం

సిటీబ్యూరో, జూన్23 (నమస్తే తెలంగాణ): నీట్ అండ్ జేఈఈ పరీక్షల సన్నాహక సేవలలో జాతీయ అగ్రగామిగా పేరొందిన ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎ ఐఎస్ఎల్) సోమవారం చందానగర్‌లో తమ కొత్త సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చింది. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై సెంటర్‌ను ప్రారంభించారు. సంస్థ ప్రతినిధులు అమిత్ కుమార్ ఉరిటి, నిశాంత్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.

రెవా వర్సిటీలో యోగా డే

సిటీబ్యూరో, జూన్23 (నమస్తే తెలంగాణ): బెంగుళూరులోని రెవా యూనివర్సిటీలో అంతర్జాతీయ యోగా డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యూనివర్సిటీ సిబ్బంది వేసిన విభిన్న యోగాసనాలు ఆకట్టుకున్నాయి. అనంతరం రెవా యూనివర్సిటీ ఛాన్సలర్ పీ శ్యాంరాజ్ మాట్లాడుతూ.. యోగా అనేది ఒక క్రమశిక్షణతో కూడిన సాధనమని, అంతర్గత శక్తిని పెంపొందించే ఆయుధమన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జాన్ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంపొందించుకోవడానికి యోగా కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా చేయాలని కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ స్కీంలో ట్రాక్టర్ మంజూరు

సిటీ బ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఇబ్రహీంపట్నం శాఖ ఆధ్వర్యంలో పెరుమాండ్ల రమేష్‌కు ఎస్సీ కార్పొరేషన్ స్కీం కింద ట్రాక్టర్ మంజూరు చేసినట్లు రీజినల్ మేనేజర్ డీవీఎస్ రామారావు తెలిపారు. బ్రాంచి మేనేజర్, సిబ్బందితో కలిసి తమ ఖాతాదారుడు రమేష్‌కు ట్రాక్టర్ అందజేశామని చెప్పారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సమాయత్తం!

ఓటరు దరఖాస్తుల పరిశీలనను ముమ్మరం చేసిన అధికారులు

ఓటర్ ఎన్‌రోల్‌మెంట్‌కు బ్రేక్

జూలై 2,3 న బీఎల్‌వోలకు శిక్షణ

ఏఈ ఆర్ఓ, ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్

జూబ్లీహిల్స్, జూన్ 23: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే ఓటరు దరఖాస్తుల పరిశీలన ముమ్మరం చేసిన అధికారులు తాజాగా జూబ్లీహిల్స్ అసెంబ్లీలో ఓటర్ ఎన్‌రోల్మెంట్‌కు నిలిపివేశారు. అలాగే జూలై 2, 3 తేదీలలో బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న 329 పోలింగ్ బూత్‌ల పరిధిలోని బూత్ లెవెల్ అధికారులకు, సిబ్బందికి తొలి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జూబ్లీహిల్స్ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్ తెలిపారు. కాగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కొత్త ఓటరు నమోదు, సవరణలు నిలిచిపోవడంతో ఇప్పటివరకు వచ్చిన ఫారం-6 ఫారం-7, ఫారం-8 తదితర దరఖాస్తుల పరిశీలన పక్కాగా చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా...

ఉప ఎన్నికకు సంబంధించి ఓటరు జాబితాను పారదర్శకంగా సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో మరణించిన వారి పేర్లు తొలగించడం ప్రధానం. ఆయా పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు మరణ ధృవీకరణ పత్రం లేదా కుటుంబ సభ్యుల వాంగ్మూలం తప్పనిసరి. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో కూడా వయసు ధ్రువీకరణ పత్రం లేదా ఆధార్ కార్డు తప్పనిసరి. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల అధికారులు పర్యటించినప్పుడు చేసే ర్యాండం చెక్‌లో తప్పొప్పులు కనిపిస్తే సంబంధిత అధికారులనే పూర్తి బాధ్యులను చేయనున్నారు. పైన పేర్కొన్న రెండు అంశాలతో పాటు ఓటరు గుర్తింపు కార్డులలో సవరణలు, చిరునామాల మార్పు తదితర అంశాలలో కూడా పూర్తిస్థాయి నిర్ధారణ చేసుకోకుండా ఇంటి వద్ద కూర్చుని ఓటరు జాబితా సిద్ధం చేస్తే సంబంధిత బాధ్యులపై చర్యలు తప్పవని సమాచారం. త్వరలోనే నగారా మోగించనుందనే టాక్ నడుస్తోంది.

బోనాల నిధులను పెంచండి

మల్లాపూర్, జూన్ 23: ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని దేవాలయాల్లో బోనాల పండుగ సందర్భంగా ప్రతీ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులను పెంచాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి నిధులను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీన్ ముదిరాజ్, నేమూరి మహేష్‌గౌడ్ ఉన్నారు.

చెప్పలు మోసినప్పుడు ఇజ్జత్ ఏమైంది బండి?

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి

హైదరాబాద్ జూన్ 23 (నమస్తేతెలంగాణ): 'కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం జాతీయ హోదా ఇస్తే ఇజ్జత్ పోయేదని మాట్లాడుతున్న బండి సంజయ్..మరి గుజరాతోడి చెప్పులు మోసినప్పుడు, చర్లపల్లి రైల్వేస్టేషన్, ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ కుప్పకూలినప్పుడు, లిఫ్ట్‌లు, రైల్వేగేట్లు జాతికి అంకితం చేసినప్పుడు ఇజ్జత్ ఎక్కడికిపోయిందని' బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఎద్దే వా చేశారు. కాళేశ్వరంపై బండి సంజయ్ చేసిన నిరాధార ఆరోపణలతో రేవంత్, బీజేపీ కలిసి తెలంగాణను ఎండబెట్టే కుట్ర బట్టబయలైందని సోమవారం ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఏ పీ కడుతున్న అక్రమ ప్రాజెక్ట్ బనకచర్లను అడ్డుకోవాల్సింది పోయి బీఆర్ఎస్‌పై నిందలేయడం దుర్మార్గమన్నారు. ఏపీ అభివృద్ధికి తెలంగాణ కంటే పది రెట్లు ఎక్కువ నిధులిచ్చామని మాట్లాడే బండికి తెలంగాణలో ఉండే హక్కు ఎక్కడిది? బీఆర్ఎస్‌పై విమర్శించే అర్హత ఎక్కడిది? అని ప్రశ్నించారు. ఎంపీ ఈటలతో క్లాసులు చెప్పించుకోవాలన్నారు.

పెన్షనర్ల వ్యతిరేక చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

సిటీ బ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): పెన్షనర్ల పొట్ట గొట్టే ఫైనాన్స్ యాక్ట్ - 2025 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర పెన్షనర్స్ జేఏసీ ప్రతినిధులు కోరారు. ఆల్ ఇండియా పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. రిటైర్డ్ అయిన పాత పెన్షనర్లకు డీఆర్‌లు, పీఆర్‌సీ, ఇతర బెనిఫిట్స్ లేకుండా చేయడం దురదృష్టకరమన్నారు. వయోవృద్ధులైన పెన్షనర్లపై ఇలాంటి చట్టాన్ని ప్రయోగించడం సరికాదన్నారు. ప్రధాన మంత్రి సహా అన్ని జిల్లాల్లోని కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా పెన్షనర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, పెన్షనర్స్ జేఏసీ ప్రధాన కార్యదర్శి తులసి సత్యనారాయణ, కో- చైర్మన్ మారం భరత్‌రెడ్డి, రాజేంద్ర బాబు, పెన్షనర్స్ ఫోరం చైర్ పర్సన్ ఉమాదేవి, పెన్షనర్స్ అసోసియేషన్ సలీంనగర్ ప్రధాన కార్యదర్శి చోళ ఓం ప్రకాశ్ యాదవ్, కోశాధికారి ప్రసాదరావు, అసోసియేట్ అధ్యక్షుడు మదన్ మోహన్ రావు, దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి బీసీ కులవృత్తుల వస్తు ప్రదర్శన

సిటీ బ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బోనాల ఉత్సవాల సందర్భంగా ఈనెల 25 నుంచి 29 వరకు ఐదు రోజులు బీసీ కులవృత్తుల చేతివృత్తుల వస్తువుల ప్రదర్శన, విక్రయాలను నిర్వహిస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహం పక్కన చేపట్టే ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారుచేసిన మట్టిపాత్రలు, గొడ్డన్నల నీరా స్టాల్, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు, హ్యాండ్లూమ్స్ (పోచంపల్లి ఇక్కత్, గద్వాల్, నారాయణపేట్), పూసల వారి సామగ్రి సహా ఇతర బీసీలు తయారుచేసిన వస్తువులు అందుబాటులో ఉంచుతామన్నారు. తెలంగాణ వంటకాలు, బెస్త సోదరుల చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ ప్రదర్శిస్తామన్నారు. ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9:30 గంటల వరకు ఉంటుందని, ఉచిత ప్రవేశం ఉంటుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని, చేతివృత్తులవారిని ప్రోత్సహించాలని మంత్రి కోరారు.

డయేరియాపై ప్రత్యేక ఫోకస్

- వైద్య, అనుబంధ శాఖలు విస్తృతంగా క్యాంపులు నిర్వహించాలి
- జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో కలెక్టర్ హరిచందన

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

సిటీ బ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): వర్షాకాలం నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో డయేరియాపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని కలెక్టర్ హరిచందన దాసరి డాక్టర్లతో పాటు అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. 'డయేరియాకి రోక్‌థామ్, శుభ్రత, ఓఆర్ఎస్‌తో జాగ్రత్తగా ఉండు' అనే థీమ్‌తో 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2025'ను జిల్లా అంతటా చేపట్టాలని, గతంలో డయేరియా వచ్చిన చోట ప్రాధాన్యత ఇవ్వాలని వైద్యాధికారులకు సూచించారు. జిల్లాలో డయేరియా కారణంగా ఇకపై ఏ ఒక్కరూ మరణించకూడదని.. జిల్లా అంతటా అనుబంధ శాఖల అధికారులతో వైద్యాధికారులు క్యాంపులు చేపట్టాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అందించే ఓఆర్ఎస్, జింక్ ట్యాబ్లెట్లను అన్ని పాఠశాలలు, హాస్టల్స్, అంగన్‌వాడీలలో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని.. జీహెచ్ఎంసీ ద్వారా పరిశుభ్రత, మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా నాణ్యమైన తాగునీటి సరఫరా, ట్యాంకుల శుభ్రత, నీటి పరీక్షలు, డిస్‌ఇన్‌ఫెక్షన్ లాంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, జిల్లా విద్యాధికారి రోహిణి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీస్, మహిళాశిశు సంక్షేమ శాఖల అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

గొడితప్పిన ఇంజినీరింగ్

(మొదటిపేజీ తరువాయి)

జీహెచ్ఎంసీలో ఎస్ఎన్‌డీపీ సీఈ కోటేశ్వరరావు, 16వ స్థానంలో ఉన్న మరో సీనియర్ ఇంజినీర్ నర్సింగ్‌రావు, 26వ స్థానంలో ఉన్న ప్రస్తుత మెయింటెనెన్స్ చీఫ్ ఇంజినీర్ రత్నాకర్ సహదేవ్, 27వ స్థానంలో ఉన్న ప్రవీణ్ చంద్ర, 29వ స్థానంలో ఉండి కొద్ది నెలల కిందటే రిటైర్ అయిన దత్తుపంత్, 33వ స్థానంలో ఉన్న విశ్వనాథ రాజులను కాదని 38వ స్థానంలో ఉన్న భాస్కర్‌రెడ్డికి కీలక పోస్టులు ఇవ్వడం సరైంది కాదని సంబంధిత లేఖలో పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అసోసియేషన్ నేతలు పేర్కొన్నారు. భాస్కర్‌రెడ్డి స్థానంలో వెంటనే రత్నాకర్ సహదేవ్‌కు కానీ నర్సింగ్‌రావులను నియమించాలని ఆ లేఖలో తెలిపారు. డీఈఈనే నియమించాలనుకున్నా.. ఆయన కంటే మోహన్ కుమార్ సీనియర్‌గా ఉన్నారని గుర్తు చేశారు. ఇక దేవానంద్ రిటైర్ అయిన తర్వాత మోహన్‌కుమార్ అత్యంత సీనియర్ అని ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా ఆయన మూడు సార్లు ఇన్‌చార్జిగా కూడా వ్యవహరించారని పేర్కొన్నారు. ఇక భాస్కర్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించడంతో మోహన్ కుమార్ స్థానంల